# 13

# పాపపు నగరిలోని సంఘం

# (2:12-17)

"అపనమ్మకంగానుండిన నమ్మకమైన సంఘం," "నరకపు ప్రధాన కేంద్రమునొద్ద సంఘము," "అపవాది పెరటిలోని సంఘం" అంటూ పెర్గము సంఘం పిలువబడింది. దాని విశేషమైన సవాలులను "పాపపు నగరిలోని సంఘం" అనే పేరుతో నేను దీన్ని సంగ్రహం చేయ ప్రయత్నించాను.

## క్రీస్తు అవసరమైన సంఘం (2:12)

ఈ స్థానిక సంఘానికి ఉత్తరం ఈ క్రింది మాటలతో పరిచయం చేయబడింది: "పెర్గములో[1] ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము ..." (12 వ.).

### నగరానికి పేరు పెట్టబడింది

మనం తీరప్రాంతానికి వెళ్లుతున్నాం.[2] మనం ఎఫెసునొద్ద ఆరంభించాం, తరువాత స్ముర్నకు ప్రయాణం చేశాం. ఇప్పుడు దాదాపు 60 మైళ్లు దాకా పయనించి పెర్గమము చేరుకున్నాం. ఆసియా అనే రోమా రాష్ట్రపు ముఖ్య పట్టణమది. ఎఫెసు, స్ముర్నవలె, పెర్గమము సముద్ర తీరాన లేదు, 15 మైళ్లు దూరం ఉంది.

పెర్గమము పర్వతము మీద స్థాపితమై క్రిందనున్న మైదానమునకు వ్యాపించింది. నేడు బెర్గమ అనే బస్తీ ప్రాచీన పట్టణం యొక్క క్రింది భాగాన్ని ఆక్రమించుకుంది. టూర్ గ్రూప్‌తో నేను దాన్ని సందర్శించినప్పుడు, మేము మొదట ఎక్రోపోలిస్‌ను,[3] తరువాత బెర్గమ పురము యొక్క పురావస్తు స్థలాన్ని, చివరిగా పట్టణం యొక్క ప్రాచీన వైద్య కాంప్లెక్స్‌ను చూడడానికి దక్షిణంగా వెళ్లాం.

పెర్గమములో ప్రభువు సంఘం ఎప్పుడు ఆరంభమయ్యింది మనకు తెలియదు. ఆసియాలోని యితర స్థానిక సంఘాలవలె, పౌలు 3 సంవత్సరాలు ఎఫెసులో ఉన్న కాలమందు అది స్థాపింపబడియుండవచ్చు (అపొ. 19:10). ఈ స్థానిక సంఘం ప్రత్యేకమైన సమస్యలను ఎదుర్కొన్నట్టు మనకు తెలుసు. "సాతాను సింహాసనమున్న స్థలములో" కాపురమున్నట్టును, "సాతాను కాపురమున్న ఆ స్థలములో" ఉన్నట్టును యేసు పెర్గమును పిలిచారు (2:13). ఆ పట్టణానికి క్రీస్తు బహుగా అవసరమైయున్నారు.

### క్రీస్తు వర్ణించబడ్డారు

భయపెట్టబడే పరిస్థితులు గల ప్రాంతంలోని క్రైస్తవులకు ప్రభువు శక్తి యొక్క అభయం అవసరమైయుంది. అందువలన, "వాడియైన రెండంచులుగల ఖడ్గముగల వాడుగా" యేసు తన్ను వర్ణించుకున్నారు (12బి వ.). (పేజీ 109 చూడు.)

దేవుని వాక్యము ఖడ్గముగా సూచింపబడినందున (హెబ్రీ. 4:12; ఎఫెసీ. 6:17), ఈ ఖడ్గము యేసు నోటనుండి బయలువెళ్లునదై ఉన్నందున (1:16; 2:16), దేవుని వాక్యమునకు దీనిని అనేకులు చూపుతారు, అయినా, ఈ వాక్యము సువార్త కాదని, తన శత్రువులపై యిది ప్రభువు యొక్క తీర్పని మనం గ్రహించవలసి ఉంటుంది (యెషయా 49:2; ప్రకటన 19:15, 21).

ఖడ్గము మేలుకొరకు వినియోగింపవచ్చు, కీడుకొరకు వినియోగింపవచ్చు. దేవుని వాక్య విషయములో కూడ అదే సత్యమైయుంటుంది. నిపుణుడైన సర్జన్ చేతిలో పనిముట్టు ఉన్నట్టు హృదయాన్ని బాగు చేయడానికి దేవుని వాక్యాన్ని వినియోగించవచ్చు (అపో. 2:37; హెబ్రీ. 4:12). ఇతర పరిస్థితులలో, దేవుని న్యాయ ధనంగా అది వినియోగింప బడవచ్చు (యోహాను 12:48). ప్రకటన 2లో, యేసు రెండవ విధానంలో ఉపయోగించే ఉద్దేశం కలిగియున్నారు (16 వ.).

రోము యొక్క అధికారం తనదానికంటె అధికం కాదని పెర్గములోని క్రైస్తవులు ఎరగాలని యేసు కోరుతున్నారు. ఎదిరించలేని తన ఖడ్గము ఎదుట రోమీయుల ఖడ్గాలు కేవలం పిల్లలచేత నిర్మింపబడిన వికారమైన చెక్క ఆయుధముల వంటివి మాత్రమే. అందువలన, క్రైస్తవులు రోమీయుల ఆయుధమువలన భయపెట్టబడనక్కర లేదు. ప్రభువు యొక్క తీర్పు ఖడ్గానికి మాత్రమే వారు భయపడవలసినవారై యుంటారు (2:16).

## సాతానును గద్దె ఎక్కించిన పట్టణం (2:13)

స్థానిక సంఘాన్ని మెచ్చుకొనడంలో పెర్గమునకు వ్రాసిన ఉత్తరం అసలు భాగం ప్రారంభమౌతుంది.

### సాతాను గద్దె ఎక్కించబడ్డాడు

వారి ఎదుటనున్న భయంకరమైన సవాలును ఆయన ఎరిగియున్నట్టు అభయమిచ్చారు: "–సాతాను సింహాసనమున్న స్థలములో నీవు కాపురమున్నావని[4] నేనెరుగుదును. మరియు సాతాను కాపురమున్న[5] ఆ స్థలములో ..." (13 వ.). ప్రకటన గ్రంథం అనేక తారతమ్యాలు తెలుపుతుంది. ఒక తారతమ్యం దేవుని సింహాసనం సాతాను సింహాసనమునకు మధ్య. 4, 5 అధ్యాయాలలో తన మహిమ అంతటితో దేవుని సింహాసనం ప్రదర్శింపబడింది. దానికి ముందు, 2వ అధ్యాయంలో, సాతానుకు కూడ తన సింహాసనమున్నట్టు – తన అధికారము, ప్రభావానికి సంబంధించిన కేంద్రాలున్నట్టు మనం చూస్తాం. పెర్గము అలాటి ఒక కేంద్రమైయుంది.

"సాతాను సింహాసనమేమో" నిర్వచించి దాన్ని డిఫెండ్ చేయడానికి కామెంటేటర్స్ (వ్యాఖ్యానకర్తలు) పేజీలు నింప ప్రయత్నించారు. అయితే ప్రయోగింపబడిన పదమే

వెన్నెముకలోనికి వణకును పంప చాలునదైయుంది. సాతాను సంబంధమైన కార్యకలాపాలు వేదికనలంకరించాయి.

ప్రభువు సందేశాన్ని అర్థం చేసికొనడానికి గాను సాతాను సింహాసనంగా ఏదో యొక ప్రత్యేకమైనదాన్ని గుర్తింపచేయ పనిలేదు. అయితే పెర్గములోని క్రైస్తవులు ఎదుర్కొనే ఆటంకాలను రివ్యూ చేస్తేనే దానినుండి మనం మేలు పొందవచ్చు.

*సాతాను రాజకీయంగా గద్దె ఎక్కించబడ్డాడు.* పెర్గముకు రోముతో బలమైన సంబంధాలున్నాయి. చక్రవర్తికి గుడి కట్టించే హక్కును పొందిన రాష్ట్రంలోనే తొలి పట్టణమది. నేడు, మైదానంలో నిలిచి, ఎక్రోపోలిస్‌వైపు నీవు చూచినట్టయితే, బహు గంభీరంగా కన్పించేది పాలరాయితో కట్టబడిన భవనం అది ట్రేజన్ చక్రవర్తికి సమర్పింపబడింది. Thrice Neokorus అనే బిరుదుపొందిన అహంకారముగల పట్టణం పెర్గము.[6] అంటే చక్రవర్తులను ఘనపరచడానికి కట్టబడిన మూడు దేవాలయాలు గలది అని ఆ పేరు సూచిస్తుంది.

తూర్పు తీరాన పెర్గము రోముకు బలమైన దుర్గము. ఆసియాలో రోమీయుల రాష్ట్ర ప్రభుత్వ కేంద్రమైయుండి రోమా చక్రవర్తి ఆరాధనను అమలు చేయు పట్టణమైయుంది. చక్రవర్తి ప్రభువుగా గుర్తింపబడే, చక్రవర్తి ఆరాధనను అమలుపరచడానికి బాధ్యతగల పట్టణమైయుంది. చక్రవర్తిని ప్రభువుగా ప్రతి పౌరుడు గుర్తించడానికి పౌర అహంభావమే చాలినంత ఒత్తిడి చేస్తుండేది.[7]

*మతపరంగా సాతాను గద్దె ఎక్కించబడ్డాడు.* చక్రవర్తులకు గుడులను సమర్పణ చేయడానికి తోడు, యితర మత సంబంధమైన కట్టడాలతో పెర్గము నిండియుంది.[8] ఉదాహరణకు, అక్రోపొలిస్‌లో జేయస్ బలిపీఠముంది. అనేకులు దానిని ప్రాచీన ప్రపంచపు ఏడు వింతలలో ఒకటిగా భావించేవారు.

అటు రోమీయులు, యిటు గ్రీసు దేశస్థులు జేయిస్‌ను[9] దేవతలలో ప్రధానమైనదిగా భావించేవారు. పెర్గము రాజు ఒక గొప్ప యుద్ధ విజయాన్ని సాధించిన తరువాత, జేయిస్‌పై తన అభిమానాన్ని కనుపరచడానికి ఒక పెద్ద బలిపీఠం కట్టడానికి ఆజ్ఞాపించాడు. పూర్తి చేయబడిన కట్టడం 120 అడుగుల పొడవు, 112 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు గలదైయుంది.[10] ప్రక్కలలో గ్రీకు దేవత తన శత్రువులపైన విజయం పొందినట్టు చిత్రింపబడింది. అలా చెక్కిన రూపమే చిత్రకారుని మహా గొప్ప పనితనంగా భావింపబడేది.

బెర్గమ అనే పట్టణపు మధ్యలో విగ్రహ సంబంధమైన ఆరాధనకు కొట్టవచ్చినట్టు కన్పించే మరొక ఉదాహరణగా ఉంది. అక్కడ ఐగుప్తు దేవతలకు కట్టిన గుడి యొక్క శిథిలాలు నిలిచియున్నాయి. మహా పెద్ద ఎర్ర – యిటుకలతో కట్టబడిన గోడలు 60 అడుగుల ఎత్తువరకు లేచియున్నాయి.

పట్టణానికి దక్షిణాన, మెడికల్ కాంప్లెక్స్‌లో విగ్రహారాధన సాతానుతో బహు సన్నిహితమైన సంబంధం కలిగినదైయుంది. ప్రసిద్ధిగాంచిన ఈ కేంద్రానికి దూరం నుండేమి, దగ్గరనుండేమి బాగుపడడానికి అనేకమంది రోగులు వస్తూ ఉండేవారు. Galen (క్రీ.శ. 130-200) అనే ప్రఖ్యాతిగాంచిన వైద్యుడు అక్కడ తన ప్రాక్టీసును నెలకొల్పాడు.[11] వైద్యం విగ్రహ సంబంధమైన మంత్ర తంత్రాలతోను[12] పురాతనమైన మందు (ఔషధం)తోను కూడినదైయుండేది.[13]

"పవిత్రమైన రోడ్డు" అని పిలువబడే దీర్ఘమైన వీధులలో గుండా పోయి ఆ వసతులను పొందవలసి యుండేది, ఉంటుంది. మరణాన్ని వెనుక వదలివేస్తున్నామనే విశ్వాసంతో, జోళ్లు లేకుండగనే స్వస్థత కోరుతూ ఆ వీధిలో గుండా నడిచిపోవాలి. ముఖ ద్వారంలో, ఆస్కెలోపోయిస్‌కు ప్రతిష్ఠించిన గుడి ఉంది. ఇది గ్రీసు దేశస్థులకును, రోమీయులకును స్వస్థపరచు దేవతయైయుంది. (ఆరోగ్య దేవత)[14] ఆ బలిపీఠానికి పైన ప్రధానంగా ఆ దేవత బొమ్మ ఉంటుంది: అది పెనవేయబడిన పాము,[15] ఈ బొమ్మను ఎక్కువమంది యూదులు, క్రైస్తవులు అపవాదికి గురుతుగా భావించేవారు (ఆది. 3:1–24; ప్రకటన 12:9; 20:2). ఆస్కెలోపోయిస్ ప్రత్యేకించి ఆది క్రైస్తవులకు విసుగుపుట్టించేదిగా ఉండేది.

*నాగరికంగా సాతాను గద్దె ఎక్కించబడ్డాడు.* పెర్గము తీర పట్టణం కానందున, ఎఫెసు, స్ముర్నతో వర్తకమునందు పోటీపడలేక పోయినందున, నాగరికతలో అది ప్రత్యేకతను కనుపరచింది. "[దాని] కవులు, తాత్వికులు, శాస్త్రవేత్తలు, పండితులను బట్టి ... పెర్గము ఖ్యాతి ఏథెన్సుకును, అలెగ్జాంద్రియాకును పోటీపడింది."[16]

పెర్గము యొక్క వైద్యులకును, జేయిస్ బలిపీఠపు కళాకారులకును తోడు, నాగరికపరమైన మరో సాధనం పెర్గము గ్రంథాలయం. అది 200,000 (రెండు లక్షల) గ్రంథాలుగలదై ఐగుప్తులోని "అలెగ్జాంద్రియాకున్న ప్రాముఖ్యతతో పోటీపడింది."[17] అలెగ్జాంద్రియాతో పోటీపడడంలో రెండు గుర్తింపదగిన సాధనాలను అది చేసింది: (1) ఆసియాలోని గ్రంథాలయం విషయంలో అసూయపడిన ఐగుప్తు రాజు ఆసియాకు పేపిరస్[18] పంప నిరాకరించాడు. అందును బట్టి పెర్గములోని శాస్త్రులు (లేఖకులు) తోళ్లకు, ప్రాచీన రచన సాధనాలకు మళ్లారు. పార్చ్‌మెంట్స్‌ను[19] పరిపూర్ణమైనవిగా చేసేవరకు పనివారు ప్రయోగం చేస్తూనే ఉన్నారు. "పెర్గమునుండే" పార్చ్‌మెంట్ అనే పేరు వచ్చింది. (2) పేపిరస్ చుట్టబడేంత తేలికగా చక్కగా పార్చ్‌మెంట్ చుట్టబడేది కాదు గనుక ప్రాచీనపు చుట్టలకు మారుగా పేజీలుగల పుస్తకాల రూపం ఏర్పడింది.[20]

పెర్గము నాగరికత కేవలం వివేకులకు మాత్రమే యింపుగా ఉన్నది కాదు. ఆర్కొపొలిస్‌కు నైఋతిగా 10,000 సీట్లు గల గొప్ప ఏరియాలో దిగుచుండిన కొండ చరియలో పంకా ఆకారంలో నర్తక శాల యొకటి నిర్మింపబడింది. 78 సీట్లు లైనుగల దానిలో తొలి లైనులో మా టూర్ గ్రూప్ నిలిచినప్పుడు, వేదిక ఉన్న చోటును చూస్తుంటే నా కన్నులు తిరిగాయి. నేరుగా మా యెదుట సహజ శృంగారముగల పర్వత శిఖరాలు ఉన్నాయి. క్రింద ఎడమవైపు బెర్గమ నరగముంది. పైగా ఆకాశము, సూర్యుడు, మేఘాలు మాత్రమే ఉన్నాయి.

పెర్గము సాతాను కాపురమున్న చోటుగా మారడానికి గ్రంథాలయము, నర్తక శాల, మిగతా నాగరిక రూపాలకు సంబంధమేముంది? వివేక సంబంధమైన, శిల్పకళా వృత్తులు తప్పనిసరిగా చక్రవర్తి ఆరాధనతో గాని, విగ్రహ సంబంధమైన దేవతారాధనతో గాని, లేక రెండింటితో గాని సంబంధం కలిగి ఉన్నాయి. వర్ణింపబడిన నర్తక శాలకు సంబంధించిన కార్యకలాపాలు మద్యపాన (ద్రాక్షారస) దేవతయగు డియోనిసస్ ఉత్సవాలతో సంబంధం కలిగి ఉంటాయి. వేదిక ఏరియాకు ఉత్తర భాగపు చివరిలో డియోనిసస్ గుడికి సంబంధించిన శిథిలాలు యింకా కన్పిస్తునే ఉంటాయి.

*సాతాను నైతికపరంగా గద్దె ఎక్కించబడ్డాడు.* అవినీతి – ప్రత్యేకించి లైంగిక అవినీతి –

పెర్గము రాజకీయ, మత సంబంధమైన, నాగరికత వ్యవహారాలలో కలిసియున్న (పూర్ణమగుటకు అవసరమైన) భాగమైయుంది. ఆ పట్టణ పౌరులు – "జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, వగైరాలలో" అనుభవశాలులైయున్నారు (గలతీ. 5:19–21ఎ).

పెర్గమును గురించి నేను ఎంత ఎక్కువ తెలిసికుంటే, అంత ఎక్కువగా LaMar Berrettతో నేను ఏకీభవిస్తాను. జేయస్ బలిపీఠాన్ని గూర్చి అతడు వ్రాసినప్పుడు, "సాతాను సింహాసనం అది కాకపోవచ్చు, పెర్గము పట్టణమే అది అయ్యుంటుంది."[21] దాని పౌరుల జీవితాల్లోను, హృదయాల్లోను, మనస్సుల్లోను సాతాను గద్దె ఎక్కాడు.

వేలకొలది మంది ఆలోచనను వశపరచుకునే ఆలాటి సాతాను కేంద్రాలు నేడున్నాయా? ఒక నిర్ణయము లేని, విరక్తి చెందిన, ఉల్లాసాన్ని కోరే స్థలాలున్నాయా? సాతాను ప్రభావాన్ని కనుపరచే అనేక మూలాలు జ్ఞాపకమొస్తున్నాయి: లోకంలోని ప్రధాన నగరాలు, రాజకీయ అధికార కేంద్రాలు, శరీర సుఖాలకు సమర్పింపబడిన ప్రాంతాలు, సెక్యూలర్ యూనివర్సిటీ క్యాంపస్‌లు.[22] వీటితో మనం మీడియా: పుస్తకాలు, సినిమాలు, టీ.వి.లను చేర్చవచ్చు.[23] వాడు లోకాన్ని అందుకోడానికి అపవాది యింకను అధికార స్థానాలు కలిగియున్నాడు!

**శిష్యులు అక్కడ అపాయ స్థితిలో ఉన్నారు**

సంఘము పట్ల ప్రభువు మెచ్చుకునే మాటలను అభినందించడానికి మనం సిద్ధంగా ఉన్నాం: "మరియు సాతాను కాపురమున్న ఆ స్థలములో, నాయందు విశ్వాసియైయుండి ... నీవు నా నామము గట్టిగా చేపట్టి నాయందలి విశ్వాసమును విసర్జింపలేదని నేనెరుగుదును" (13ఎ, బి వ.). దయలేని పరిసరాల్లో జీవిస్తున్నప్పటికిని, పెర్గములోని క్రైస్తవులు నమ్మకస్థులైయున్నారు!

వారు యేసు అను వ్యక్తిని మాత్రమే గాక ఆయన ఆదేశాలను సయితం ఆనుకొని యుండవలసి ఉండును. "నాయందలి విశ్వాసము" అనేది అక్షరార్థంగా – "the faith of me." "విశ్వాసం" అనే పదానికి ఆది భాషలో ("the") అనే డెఫినిట్ ఆర్టికల్ ఉపయోగించినప్పుడు, సాధారణంగా, "యేసునందలి విశ్వాసానికి కేంద్రంగా ఉండే body of teaching"ను సూచిస్తుంది – అంటే, క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన అంతా.[24] యేసు ఏమైయున్నారో, ఆయన ఏమి బోధించారో – దానినంతటిని వారు విశ్వసించి యున్నారు.

పైగా, మరణ భయముచే వారు బెదిరింపబడినప్పుడు సయితం, వారు నమ్మకముగానే నిలిచియున్నారు: "సాతాను కాపురమున్న ఆ స్థలములో, నాయందు విశ్వాసియైయుండి నన్ను గూర్చి సాక్షియైన[25] అంతిపయనువాడు మీ మధ్యను చంపబడిన[26] దినములలో సయితము నమ్మకముగా ఉన్నారు" (13 సి, డి వ.). స్ముర్నలోని సంఘం యిలా హెచ్చరిక చేయబడింది, "ఇదిగో మీరు శోధింపబడునట్లు అపవాది మీలో కొందరిని చెరలో వేయింపబోవుచున్నాడు" (2:10బి). ఇంకా అధికమైన కీడు స్ముర్నలోని క్రైస్తవులకు రానున్నది. కాని పెర్గములో సాతాను అంతకు ముందే తన కండరాలను బిగించింది. ఆ పట్టణంలో తొలి క్రైస్తవుడు చంపబడ్డాడు.

అంతిప అనే వ్యక్తి ఎవరో మనకు తెలియదు, అయితే ప్రభువు అతనినెరుగు. యువకుడో, వృద్ధుడో, వివాహితుడో, ఒంటరిగాడో (లోకపు దృష్టిలో) జయప్రదమైనవాడో,

కాడో మనకు తెలియదు; కాని "నాయందు విశ్వాసియైయుండి" నన్ను గూర్చి సాక్షియైనవాడని యేసు అతని గూర్చి తెలిపారు. చివరకు, లెక్కకు వచ్చేదంతా అదే.

## పట్టణం సంఘాన్ని ప్రభావితం చేసింది (2:14, 15)

అక్కడే ఉత్తరం ముగించియుంటే బాగుండేదని నా తలంపు, కాని 14వ వచనంతో చలిమిరిగొనిపోయే మాటలు ఆరంభమయ్యాయి "అయినను నేను నీమీద కొన్ని తప్పిదములు మోపవలసియున్నది" యేసు "నీ మీద కొన్ని తప్పిదములను మోపవలసినప్పుడు" అది భయపడవలసిన సమయం! 1961, ఎలుక మందు తిని చచ్చినవాడి సమాధి కార్యక్రమం నేను చేయవలసి వచ్చింది. గోధుమ పిండిలో కొద్దిగా విషం కలుస్తుంది. అదే ఎలుక మందు. అయితేనేమి - మనిషి తిని చచ్చాడు.[27]

పెర్గము క్రైస్తవులకు వ్యతిరేకంగా ప్రభువుకున్న ఆ "కొద్ది సంగతులు" ఏవి?

> అవేవనగా, విగ్రహములకు[28] బలియిచ్చినవాటిని తినునట్లును, జారత్వము[29] చేయునట్లును, ఇశ్రాయేలీయులకు ఉరి యొడ్డుమని[30] బాలాకునకు నేర్పిన బిలాము బోధను అనుసరించువారు నీలో ఉన్నారు. అటువలెనే నీకొలాయితుల బోధ ననుసరించు వారును నీలో ఉన్నారు (14బి, 15 వచనాలు).

దోషాన్ని ఉపదేశించేవారిని తమయొద్ద ఉండమని పెర్గములోని క్రైస్తవులు అనుమతించినట్టున్నారు. అబద్ధపు ఉపదేశకులను సహించలేనందుకు ఎఫెసు సంఘాన్ని ప్రభువు మెచ్చుకున్నారు. వారిని సహించినందుకు ఆయన పెర్గము సంఘం వారిని తప్పు పట్టారు.

### రాజీని ప్రసంగించే మనుష్యులు

యేసు సూచించిన అబద్ధ బోధకులెవరు? "బిలాము బోధననుసరించువారు" అనియు "నీకొలాయితుల బోధననుసరించువారు" అనియు సూచించేది ఒకే భక్తిహీనమైన సందేశమై యుండవచ్చు.[31] ఉత్పత్తిదారులు కొన్నిసార్లు ఒకే వస్తువును తీసికొని రెండు బ్రాండులతో (పేరుల క్రింద) అమ్ముతూ ఉండేవారు. అలాగే తప్పు సిద్ధాంతాన్ని అపవాది తయారు చేసి, వ్యత్యాసమైన పేర్లు అంటించినట్టున్నాడు.

"బిలాము బోధను" గూర్చి నేర్చుకొనడానికి గాను సంఖ్యాకాండము 22నుండి 25 అధ్యాయాలలోని సందేశంతో ఆరంభించు: ఇశ్రాయేలీయులను తనకొరకు శపించినట్టయితే మహా గొప్ప బహుమానాన్ని బాలాకు బిలామునకు వాగ్దానం చేశాడు, కాని ప్రవక్త అలా చేయలేకపోయాడు. తరువాత ఏమి జరిగిందో తెలిసికొనడానికి నీవు బైబిలులోని యితర భాగాలకు వెళ్లాలి: బాలాకుచే యివ్వబడే ధనాన్ని పొందడానికి గాను (2 పేతురు 2:15; యూదా 11), బిలాము తప్పుడు త్రోవను త్రొక్కాడు. అతడు బాలాకుకు ఏమి చెప్పినట్టున్నాడంటే, "నేను ఇశ్రాయేలీయులను శపించలేను, నీ స్త్రీలను వారి పురుషుల మధ్యకు పంపి, విగ్రహ సంబంధమైన ఆరాధనతోను, జారత్వంతోను

వారిని పాడుచేసినట్టయితే, దేవుడు వారిని శపిస్తాడు.” బాలాకు బిలాము బోధ ననుసరించాడు. దానికి ప్రతిఫలంగా దేవుడు ఇశ్రాయేలులో 24,000 మందిని తెగులుతో చంపాడు (సంఖ్యా. 25).[32] “*బిలాము మాటను బట్టి*” అన్య స్త్రీ “ఇశ్రాయేలీయుల చేత యెహోవా మీద తిరుగుబాటు” చేయించిరి అని మోషే వ్రాశాడు (సంఖ్యా. 31:16ఎ).[33] పట్టణం యొక్క విగ్రహ సంబంధమైన నాగరికతతో కలిసిపోవడం క్రైస్తవులకు అంగీకారమేయని పెర్గములోని “బిలామీయులు” ఉపదేశించారనేది నిస్సందేహం.

గతంలో మనం నీకొలాయితులను, ఎఫెసీ సంఘానికి వ్రాసిన ఉత్తరం చదివినప్పుడు చూచాం (2:6).[34] అవినీతిని వెంటాడిన జ్ఞానతత్వవాదుల (Gnostic) గుంపుగా నీకొలాయితులను క్రైస్తవ రచయితలు గుర్తించారు. “Gnostic” అనే పదం “తెలివి” అని అర్థమిచ్చే (*gnosis*) అనే గ్రీకు పదంనుండి వచ్చింది. ఇతరులకు లభ్యం కాని జ్ఞానము, గ్రహింపు తమకే ఉన్నట్టు ఈ జ్ఞానతత్వవాదులు చెప్పుకుంటారు. తాను మారుమనస్సు పొందినా, పొందకపోయినా, దేవుని బిడ్డ తాను చేయగోరిన పాపమంతా చేస్తాడు, దేవుని కృప అతని పాపాన్ని కప్పుతుందనేది ప్రసిద్ధిగాంచిన జ్ఞానతత్వవాదుల సిద్ధాంతాల్లో ఒకటి. ఈ విధంగా వారు “మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగం చేస్తున్నారు” (యూదా 4).[35]

అటు బిలామీయులు, యిటు నీకొలాయితులు దోషాన్ని బోధించారు, దేవుని పిల్లలను పాపం చేయడానికి పురికొల్పారు.

### రాజీపడిన సభ్యులు

అబద్ధ ఉపదేశకులను ఎలా ట్రీట్ చేయాలో క్రొత్త నిబంధనలో తేటగా ఉంది: వారి ఉపదేశాన్ని గుర్తించి, “వారిలోనుండి తొలిగిపోవుడి” అని పౌలన్నాడు (రోమా 16:17). “మావలన పొందిన బోధన ప్రకారము కాక అక్రమముగా నడుచుకొను ప్రతి సహోదరుని యొద్దనుండి తొలిగిపోవుడి” (2 థెస్స. 3:6; KJV). దోషాన్ని ఉపదేశించే వానిని ప్రోత్సహించితే, “వాని దుష్ట క్రియలలో పాలైనట్టేనని” యోహాను అన్నాడు (2 యోహాను 11).

పెర్గములోని క్రైస్తవులు యింత తేటైన సూచనలకు ఎందుకు లోబడకపోయారు? అబద్ధ ఉపదేశకులకు ఒకవేళ ఆ స్థానిక సంఘంలో స్నేహితులున్నారేమో. వారిని క్రమశిక్షణలో పెట్టితే సంఘానికి సమస్యలేర్పడతాయని నాయకులు భయపడ్డారేమో. విరుద్ధమైన లోకానికి వ్యతిరేకంగా ఐక్యతతో వారు కలిసియుండాలని సభ్యులు తలంచి, అందుకు వారు దోషాన్ని సహించియుండవచ్చు. సమస్యను వదలిపెట్టితే, దానంతట అదే పోతుందని వారు తలంచియుంటారేమో. వారి రీజనింగ్ ఏమైయుండినా, అబద్ధ బోధకుల పట్ల “జీవించు, జీవించనీయ్యి” అనే పాలసీ ప్రభువుకు అంగీకారంగా ఉండలేదు!

## ఆ పట్టణాన్ని యేసు త్వరలో దర్శించనున్నారు (2:16, 17)

### అపాయకరమైన అవకాశాలు

యేసు యిలా హెచ్చరించారు, “కావున మారుమనస్సు పొందుము; లేనియెడల

నేను నీయొద్దకు త్వరగా వచ్చి నానోటనుండి వచ్చు ఖడ్గముచేత వీరితో యుద్ధము చేసెదను" (16 వ.).

దోషాన్ని ఉపదేశించేవారిని ఎదుర్కొని వారిని మార్చడానికి ప్రయత్నించవలసిన అవసరత పెర్గములోని క్రైస్తవులకు అవసరమైయుంది (యెహెజ్కేలు 3:18–21). అబద్ధ బోధకులు మార్చబడడానికి యిష్టపడకపోతే, వారిలోనుండి అట్టివారిని "వెలివేయాలి" (1 కొరింథీ. 5:13; KJV; 1నుండి 12 వచనాలవరకు కూడ చూడు). పైగా, వెంటనే చర్య తీసికోవలసియుంటుంది. "ఈ విషయాన్ని నీవు త్వరలో తేల్చకపోయినట్టయితే, దాన్ని తేల్చుకొనడానికి నేను త్వరలో రావలసి ఉంటుంది – నేను అలా చేసినప్పుడు నీకు ఆనందం కలుగదు!"[36]

ఈలాటి సందర్భంలో "నేను వచ్చుచున్నాను" అనే మాటలు లోకాంతమందు జరిగే రెండవ రాకడను సూచించవు; ఈ జీవిత కాలంలో దుష్టులను శిక్షించడానికి పరమునుండి ప్రభువు పని చేస్తారు.[37] తీర్పు కొరకైన తన భయంకరమైన ఖడ్గాన్ని ఆయన ఎలా ఉపయోగిస్తారో ప్రభువు తెలుపలేదు కాని, "జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము" (హెబ్రీ. 10:31).

యేసు హెచ్చరికలో "నీవు," "వారిని" అనే మాటల మధ్య తారతమ్యాన్ని గమనించు: "నేను నీయొద్దకు త్వరగా వచ్చి నా నోటనుండి వచ్చు ఖడ్గముచేత వీరితో యుద్ధము చేసెదను." "నీ" (నీవు) అనేది స్థానిక సంఘమంతటిని, "వీరు" అనేది దోషభరితమైన[38] సందేశాన్ని వ్యాపింపజేయువారిని సూచించుచుండవచ్చు. అబద్ధ బోధకులను శిక్షించడానికి యేసు వచ్చుననే వాస్తవం సంఘానికి అక్కర కలిగించియుండవచ్చు (గలతీ. 6:1). తన సొంత క్షేమాన్ని గూర్చి సంఘము అక్కర కలిగియుండవచ్చు. భక్తిహీనులపై ప్రభువు తన ఖడ్గాన్ని త్రిప్పినప్పుడు, వారినుండి తమ్మును దూరం చేసికోనివారిని ఆయన విడిచిపెట్టడు (యెహెజ్కేలు 3:18). "నేను అబద్ధ బోధకుల మీద బాంబువేయబోతున్నా; నేను అలా చేసినప్పుడు వారింకను మీమధ్యనున్నట్టయితే, మీరును వారితో కూడ లయపరచబడతారు!"

తప్పు దిద్దు క్రమశిక్షణ[39] ఎన్నడూ అంత సులభమయ్యింది కాదు, అయినా అది అవసరమైయుంటుంది: సంఘ పవిత్రతకును, సంఘం యొక్క పేరు ప్రతిష్టతలకును, రక్షింపబడినవారు రక్షింపబడినట్టే నిలుపడానికిని యిది అవసరమైయుంటుంది.[40]

### ప్రశస్తమైన వాగ్దానాలు

ఉత్తరాలన్నిటిలో ఉన్నట్టు, ప్రతి స్థానిక సంఘ సభ్యుడు వ్యక్తిగతమైన వర్తింపు చేసికోవాలని యేసు పోటీపెడుతున్నారు: "సంఘములతో **ఆత్మ** చెప్పుచున్న మాట చెవిగలవాడు వినును గాక" (17ఎ వ.). విని, లోబడునట్లు ప్రోత్సహించడానికి గాను, యేసు ప్రత్యేకమైన వాగ్దానాలను ఎత్తిపట్టారు: "జయించువానికి మరుగైయున్న మన్నాను భుజింపనిత్తును. మరియు అతనికి తెల్లరాతినిత్తును; ఆ రాతిమీద చెక్కబడిన యొక క్రొత్త పేరుండును; పొందినవానికే గాని అది మరి యెవనికిని తెలియదు" (17బి, సి వ.).

వాగ్దానంలో మొదటి భాగం – "మరుగైయున్న మన్నాను" సూచించును – దీని వ్రేళ్లు పాత నిబంధనలో పాతుకొని ఉన్నాయి. ఇశ్రాయేలీయులు అరణ్యంలో

ప్రయాణించేటప్పుడు, దేవుడు వారిని మన్నాతో పోషించాడు (నిర్గమ. 16:13-36; కీర్తన. 78:24).[41] మన్నాగల పాత్రను యెహోవా మందసంలో ఉంచారు.[42] (ఆ విధంగా అది "దాచబడింది") దేవుడు తన ప్రజలకు దాన్ని ప్రసాదించినట్టు, ప్రసాదిస్తునే యున్నట్టు అది గుర్తు చేయడానికి ఉద్దేశింపబడింది (నిర్గమ. 16:33, 34; హెబ్రీ. 9:4). ఆలాగే, విధేయులైన పెర్గము జనులకు ప్రభువు దయచేయువారైయుంటారు.[43]

వాగ్దానంలోని రెండవ భాగం అంత తేటగా లేదు: "మరియు అతనికి తెల్లరాతినిత్తును; ఆ రాతిమీద చెక్కబడిన యొక క్రొత్త పేరుండును; పొందినవానికే గాని అది మరి యెవనికిని తెలియదు" (17బి, సి వ.). "తెల్ల రాయి" అనేది ఒక ప్రాచీన ఆచారాన్ని సూచించు చుండవచ్చు - అందులో రెండు రాళ్లు ఒకటి తెల్ల, ఒకటి నల్ల రాళ్లుంటాయి, ఒకటి అంగీకారానికి, మరొకటి అంగీకారం లేకపోవడానికి సూచనగా ఉంటాయి.[44] దేవుని "తెల్ల రాతిని" యివ్వడం దేవునిచే అనుమతించబడడానికి సమానంగా యివ్వబడుతుంది![45]

"ఆ రాతిమీద చెక్కబడిన యొక క్రొత్త పేరు" ఏమి? "పొందినవానికే గాని అది మరి యెవనికిని తెలియదట!" తరువాత అధ్యాయంలో, యేసు తన సొంత క్రొత్త పేరును సూచించారు (3:12; NRSV).[46] "క్రొత్త పేరు" కేవలం "యేసు" అనేదే అయ్యుండవచ్చు.[47] "యేసు" అనేదానిలో నూతనత్వమేమీలేదని ఎవడైనా ఆక్షేపణ తెలిపినట్టయితే, తన్ను ప్రేమించి అభినందించేవారికి ఆ పేరు ఎల్లప్పుడు నూతనంగానే ఉంటుందని నేను జవాబిస్తాను.

> నేను విననిష్టపడే నామమొకటుంది,
> దాని విలువను నేను పాడగోరతాను;
> నా చెవిలో అది సంగీతంగా వినిపిస్తుంది,
> భూమిమీద అది మధురాతి మధురం.[48]

"యేసు"[49] నామాన్ని నిజంగా "ఎరిగి" (గ్రహించి అభినందించేవారు) కేలవం ఆయనచే రక్షింపబడినవారు మాత్రమే (అపొ. 4:12 చూడు)!

## ముగింపు

క్రైస్తవుడుగా ఉండడం అంత సులభమేమీ కాదని పెర్గమునకు వ్రాసిన ఉత్తరం తెలుపుతుంది. స్థిరంగా నిలిచియుండ ధైర్యం చాలినవారికొరకు, పరిస్థితులెట్టివైనా తనయందలి విశ్వాసాన్ని వదలుకోలేనివారికొరకు యేసు యింకను చూస్తున్నారు. దైవికమైన ప్రమాణానికి అనుగుణముగా లేని బోధ, జీవితాలు లేని సహోదర సహోదరీలను ఎదుర్కొనడానికి తగినంత (చాలినంత) ప్రేమగలవారికొరకు ఆయన యింకను ఎదురు చూస్తున్నారు. రాజీపడడాన్ని ప్రభువు సహించరు.

"జయించువారముగా" ఉండాలని ఈ ఉత్తరం మనలనందరిని సవాలు చేస్తుంది: మన పిరికితనాన్ని, మన అక్కర లేమిని, యేసు మనలను ఏమైయుండమని కోరారో అలా ఉండక పోవడాన్ని జయించువారమైయుండడానికి ఆయన పిలుపునిచ్చారు. మనం అలా చేసినట్టయితే, "దాచబడిన మన్నాను," ఆయన అంగీకారం పొందినట్టు "తెల్ల

రాతిని" ఆయన మనకు ప్రసాదిస్తారు.

నీ జీవితంలో ఆత్మ సంబంధమైన అవసరత ఉన్నట్టయితే,[50] వాక్యమను ఖడ్గము నీ హృదయాన్ని తాకాలని, వెంటనే ప్రభువునకు లోబడేలా అది నిన్ను కదిలించాలనేది నా ప్రార్థనయై ఉంది – భయంకరమైన తీర్పు ఖడ్గముచేత ఎన్నడూ నీకు విరోధంగా ఆయన యుద్ధం చేయకుండాలని నా ఆశ (మత్తయి 25:41)!

---

## ఉపదేశకులకు, సువార్తికులకు నోట్సు

ఈ పాఠానికి వీలుపడే యితర పేర్లలో – "సాతాను కాపురమున్న చోటు," "సాతాను సింహాసనమున్న స్థలము," "శోధింపబడిన సంఘం" చేర్చవచ్చు.

సూచనలు

[1]ఈ పట్టణం పెర్గమస్, పెర్గమన్, పెర్గమోస్ అని తెలియబడింది. KJVలో "పెర్గమోస్" అని ఉంది. [2]ఈ పుస్తకంలో పటాన్ని చూడు. [3]"Acropolis" అనేది "high city." అక్రోపోలిస్ అనేది కొండమీద కట్టబడిన పట్టణం. [4]"కాపురముండుటయని" తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి "స్థిర నివాసమేర్పరచుకొను" అని అర్థమిస్తుంది. [5]KJVలో "seat" అని ఉంది గాని, ఆది భాషలో "సింహాసనము" అని ఉంది *thronos* అనే అదే పదం 4వ అధ్యాయం దేవుని సింహాసనాన్ని గూర్చి వాడబడింది. "సింహాసనము" "అధికారపు స్థానాన్ని" సూచిస్తుంది. [6]అపొ. 19:35 (NASB) *neokoros* అనేది "దేవాలయపు రక్షకుడు" అని తర్జుమా చేయబడింది. తెలుగులో – "కరణము" అని అన్నారు. [7]ఎక్కువ పల్లెల్లోను, పట్టణాల్లోను సంవత్సరానికి ఒక్కసారే చక్రవర్తికి ప్రభు భక్తిని ప్రదర్శింపవలసి ఉంటుంది; పెర్గములోనైతే ఒత్తిడి కొనసాగుతునే ఉండవచ్చు. స్ముర్నలో, హింస యూదులచే ఆరంభించబడింది; పెర్గములో రోమా అధికారులే హింసను ప్రారంభించి యుండవచ్చు. [8]ఆ ప్రాంతంలో ఒక గుడి వ్యవసాయ దేవతయైన డెమెటర్‌కు సమర్పించబడింది. ఆ గుడి శిథిలాల దగ్గర "తెలియబడని దేవతకు" ఒక బలిపీఠం సమర్పింపబడినట్టు పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అపొ. 17:23లో ప్రస్తావింపబడిన దాన్ని పోలి. [9]రోమీయులు అతన్ని జూపిటర్ అని అన్నారు. [10]నేడు, అక్రోపొలిస్‌లో కేవలం పునాది మాత్రమే మిగిలిపోయింది. బెర్లిన్ మ్యూజియంలో బలిపీఠం తిరిగి నిర్మాణం చేయబడింది. పునాది మధ్య ఒక పెద్ద చెట్టు పెరుగుతుంది, మైదానంనుండి అది తేటగా కన్పిస్తుంది. అది ఉండడంవలన అది కనబడే తీరును ఊహించడానికి విమర్శకులకు సహాయపడుతుంది. మైళ్ల దూరం అది కన్పించవచ్చు.

[11]హిప్పోక్రాట్స్ (క్రీ.పూ. 460–377), "వైద్య పిత" అనబడ్డాడు. గెలెన్ అతని తరువాత రెండవవాడుగా పేర్కొనబడ్డాడు. మానవ శరీర నిర్మాణ శాస్త్రంపైన అతని పనికి గెలెన్ పేరు గాంచాడు. 13 శతాబ్దాలు ఆ అంశం మీద అతని రచనలు అధికారికాలుగా భావించబడ్డాయి. [12]"విశ్వాసపు స్వస్థత," "స్వయం సలహా" అనే మాటలు యిచ్చే ట్రీట్‌మెంట్‌లో చేర్చబడినట్టు పండితులంటారు. అనేక వ్యాధులు మానసిక సంబంధమైనవి గనుక ఈ మెడికల్ "స్వస్థతలో" తన భాగం చేసేది. పొందిన ట్రీట్‌మెంట్ యొక్క ప్రభావం అనేక ప్రాచీన రచనల్లో కన్పించవచ్చు. "నవీన విశ్వాస స్వస్థతలవారు" "పబ్లిసిటీ" ద్వారాను "సాక్ష్యాలు" చెప్పించడంతోను కార్యాలు కొనసాగిస్తారు. [13]ఆహారపు కట్టుబాటు, వ్యాయామం, విశ్రాంతి, వేడి, చన్నీటి స్నానాలవంటి కొన్ని ట్రీట్‌మెంట్స్ నిజంగా మేలు చేస్తాయి. [14]ఆ పేరుకు యిది లాటిన్ స్పెల్లింగ్ – దానికి గ్రీకు స్పెల్లింగ్ – "Asclepias." మెడికల్ సెంటర్‌ను Asclepieum అని అంటారు. [15]విగ్రహ సంబంధమైనవారికి పాము అరోగ్యానికి గురుతు ఎందుకంటే, అది తన కుసం విడిచి తిరిగి నవ యవ్వనంగా కన్పిస్తుంది. ఒక పాము గాని రెండు పాములు గాని ఒక కర్రమీద పెనవేయబడి ఉండేది విస్తారంగా వైద్య వృత్తికి గురుతుగానే వాడబడుతుంది. [16]LaMar C. Berrett, *Discovering the World of the Bible* (Nashville: Thomas Nelson Publishers, 1979), 528. [17]*Grolier Multimedia Encyclopedia,* 1997 ed., s.v. "Pergamum," by Louis L. Orlin. [18]నైలునదిలో ఎదిగే పేపిరస్ మొక్కలనుండి పేపిరస్ అనే వ్రాత పదార్థాన్ని తయారు చేస్తారు. "పేపర్" అనే పదం "పేపిరస్‌నుండి" వచ్చింది. [19]పార్చ్‌మెంట్ అనేది గొర్రె, మేక, దూడల చర్మంనుండి చేయబడింది. పార్చ్‌మెంట్ తయారు

చేయడంలో, పేపర్ మందం వచ్చేవరకు చర్మం గీకబడుతుంది. [20]"Codex" అనే పదం పేజీలు గల పుస్తకాన్ని సూచించడానికి ఉపయోగించబడింది. పెర్గము ప్రజలు తెలివితేటలను బట్టి, చుట్టలను చుట్టడానికి బదులు పేజీలు తిప్పుతున్నాం!

[21]Berrett, 529. [22]పేర్కొనిన ప్రతి స్థలం పూర్తిగా సాతాను సంబంధమైనదని నేననడంలేదు. తన పనులను జరిగించుకొనడానికి సాతాను వీటిని ఉపయోగించుకొంటాడని నేనంటున్నా. ఈ ఏరియాల్లోనే దేవుని కార్యాలను నెరవేర్చడానికి మనం పని చేయవచ్చు. కాని పెర్గములా – యివి కష్టంగా ఉంటాయి. [23]Internet ను మనం చేర్చవచ్చు. [24]కొన్ని తర్జుమాలలో "నాయందు నీ విశ్వాసం" అని గాని దానికి సమమైన పదాలు గాని ఉపయోగించబడ్డాయి. "the faith" అనే ప్రయోగం "కేవలం" యేసునందు విశ్వాసం ఉంచడంకంటెను విశాలమయ్యింది. ఏదియేలాగున్నా, ఇవ్వబడిన విశ్వాసములో యేసునందలి విశ్వాసం చేర్చబడింది. [25]"సాక్షి" అనేదానికి గ్రీకు పదం *martus*. ఈ పదంనుండి (martyr) హతసాక్షి అనే పదం వచ్చింది. "చూచి చెప్పినవాడు లేక సాక్ష్యమిచ్చినవాడు" అని ఈ గ్రీకు పదం కొన్నిసార్లు సూచిస్తుంది. అంతిప తన విశ్వాసం నిమిత్తము చనిపోడానికి కూడ వెనుకాడనివాడు. KJVలో "హతసాక్షి" అని ఉంది. అదే మాట 17:6లో తమ మరణమువలన సాక్ష్యమిచ్చినవారు. [26]KJVలో "వధింపబడినవారు" గ్రీకు క్రియావాచకము బలాత్కారమైన మరణాన్ని సూచిస్తుంది. [27]ఇంకొక ఉదాహరణను కూడ వినియోగింపవచ్చు: ఒక మనిషి పరీక్షకొరకు డాక్టరు దగ్గరకు వెళ్లాడనుకో. పరీక్షించగా మేలైన ఫలితాలను రిపోర్టిచ్చాడు. "అయితే కొన్ని విషయాలు బాగాలేదు: నీకు చక్కెర వ్యాధి ఉంది, గుండె జబ్బుంది, క్యాన్సర్ ఉంది" అన్నాడు. [28]విగ్రహములకు అర్పించివాటిని తినుట విషయంలో పౌలు చర్చించాడు (1 కొరింథీ. 8–10; రోమా 14, 15). అయితే అతని చర్చ ప్రధానంగా మాంసాన్ని మొదటిగా విగ్రహాలకు అర్పించి తరువాత మార్కెట్టులో అమ్మినదానికి సంబంధించింది. ప్రకటన 2:14లో విగ్రహారాధనలో పాలుపొందడం నేరుగా ఖండించబడింది (2 కొరింథీ. 6:16; గలతీ. 5:20; 1 యోహాను 5:21). [29]గ్రీకులో తర్జుమా చేయబడిన "అవినీతి కార్యములు చేయుట" అనేది అక్షరార్థంగా "జారత్వం జరిగించడమనేది" (KJV చూడు). విగ్రహ సంబంధమైన ఆరాధన లైంగిక అవినీతితో కూడియుంది. అది ప్రభువుచే ఖండింపబడింది (1 కొరింథీ. 6:13–20). [30]"ఉరి యొద్దుమని" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి అర్థం "ఎర ఉంచుమని ఎరపోయిన తరువాత గాలం గుచ్చుకుంటుంది" (Homer Hailey, *Revelation: An Introduction and Commentary* [Grand Rapids, Mich.: Baker Book House, 1979], 131).

[31]రెండు స్థితుల మధ్య 15వ వచనంలో "కూడ" అనే పదం సంబంధాన్ని గుప్తం చేస్తుంది. [32]బిలాము కడకు ఖడ్గంచేత చంపబడ్డాడు (సంఖ్యా. 31:8). [33]మీకా 6:5 చూడు. [34]నీకొలాయితులను గూర్చి ఈ పుస్తకములో చూడు. [35]మన పాపములకు దేవుని కృప చాలునదైయుంది, కాని పాపం చేయడానికి అది ప్రోత్సహించదు. రోమా 6:1నుండి పౌలు ఈ విషయాన్ని చర్చించాడు. నిజమైన మారుమనస్సు దేవుని సహాయముతో మన జీవితాల్లోనుండి పాపం తొలిగించేలా ప్రయత్నిస్తుంది. [36]1 కొరింథీ. 4:21లో కొరింథీ సంఘానికి పౌలు హెచ్చరికతో పోల్చి చూడు. [37]ప్రభువు రాకడ అనే రెండు భావాలకు సంబంధించిన చర్చకొరకు – ఈ పుస్తక భాగంలో "నాథా, ఎందాక" అనే పాఠంలో చూడు. [38]ఇతర అవకాశాలున్నాయి. ఉదాహరణకు, "వీరిని" అనే పదం స్థానిక సంఘంలో అబద్ధ బోధకులను క్రమపరచ నిరాకరించే ఎవరినైనా సూచింపవచ్చు. [39]"నిరోధించు" క్రమశిక్షణలో ఉపదేశము, తర్ఫీదు ఉంటుంది. దిద్దుబాటు క్రమశిక్షణలో శిక్ష ఉంటుంది. నిరోధించు క్రమశిక్షణలో మనం ఎక్కువగా ప్రయాస పడినట్టయితే, దిద్దుబాటు క్రమశిక్షణ తక్కువగా అవసరముంటుంది. నిరోధించు క్రమశిక్షణలో మనం ఎంత ఎక్కువగా కష్టపడినా, కొంత దిద్దుబాటు క్రమశిక్షణ ఎలాగో అవసరమైయుంటుంది. ఇది యింటిలో అవసరమే, సంఘంలో అవసరమే. [40]సంఘ క్రమశిక్షణలోని పలు ఉద్దేశాలకొరకు 1 కొరింథీ. 5:1, 5–7 చూడు.

[41]మన్నా అంటే ఏమో బైబిలు తేటగా చెప్పలేదు, కాని నిర్గమ. 16:15లో దేవుడు ఇశ్రాయేలీయులకు ఇచ్చిన అద్భుతమైన పోషణ. "మన్నా" అనే హెబ్రీ పదానికి "ఇదేమి?" అని అర్థం. [42]మందసం అంటే బంగారు రేకుతో తాపబడిన పెట్టె, గుడారంలోని అతిపరిశుద్ధ స్థలంలో పెట్టబడింది. ఆ పెట్టెలో మూడు వస్తువులు: పది ఆజ్ఞల పలకలు, మన్నాగల బంగారు పాత్ర, చిగురించిన అహరోను కర్ర. [43]"మన్నా" అనేది భౌతికమైన భోజనమైయుండగా, "దాచబడిన మన్నా" ఆత్మకు ఆహారమైయుండవచ్చు. తాను "జీవాహారమైయున్నట్టు" ప్రభువు చెప్పినదానికి (యోహాను 6:31, 35) అనేక మంది వ్యాఖ్యానకర్తలు దీన్ని ముడివేస్తారు. "దాచబడిన" అనే పదం – లోకంనుండి దాచబడిన క్రైస్తవ దీవెనలను యిది గుప్తం చేయవచ్చు – లోకం వాటిని పొందనేరదు, గ్రహించనేరదు, లేక గౌరవించదు. [44]"రాయి" అని తర్జుమా చేయబడిన పదం యిక్కడ, అపొ. 26:10లో మాత్రమే కన్పిస్తుంది. అపొ. 26:10లోని చివరి భాగం "I cast a pebble [of voting]" అనేది అక్షరార్థమైన తర్జుమా. నేడు కూడ "మన ఓట్లు వేయడాన్ని" గూర్చి మాట్లాడతాం. [45]ఈ ఆచరణకు తోడు, బైబిలు కాలంలో తెల్ల రాళ్లకు యితర పనులు కూడ ఉన్నాయి: ఆహ్వానాలకు, బహుమానాలకు, లెక్కలకు

వినియోగించబడ్డాయి. తెల్ల రాయి రత్నముగా కొందరు ఆలోచిస్తారు: చాల కాలం కార్బన్ మహా ఒత్తిడి క్రింద ఉంటే రత్నాలు ఏర్పడతాయి. పెర్గములోని క్రైస్తవులు మహా ఒత్తిడి క్రింద ఉన్నారు. [46]ఫిలిప్పీ. 2:9, 10 చూడు. [47]క్రొత్త పేరు అనేది "క్రైస్తవుడు" అనే అవకాశముంది (యెషయా 62:2; అపో. 11:26) – లేక 19:12లో ప్రస్తావింపబడినట్టు పేరు అనేది తెలియబడని పేరు అయ్యుండవచ్చు, పరలోకంలో మనకు బయలుపరచబడే పేరు. [48]F. Whitfield, "O How I Love Jesus," *Songs of the Church,* ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishers, 1977). [49]"యేసు" అనేది గ్రీకు రూపం "యెహోషువ" అనే హెబ్రీ పదానికి "యెహోవా రక్షించును" అని అర్థం. [50]ప్రసంగంగా ఉపయోగిస్తే పాపులు నమ్మి బాప్తిస్మం పొందేలా వివరించు (మార్కు 16:16) త్రోవ తప్పిన క్రైస్తవుని పునరుద్ధరించనవసరం ఉంది (అపో. 8:22; యాకోబు 5:16).

---

## రివ్యూ మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. యేసు నోటనుండి బయలు వెడలు "వాడియైన రెండంచులు గల ఖడ్గమేది?" వాక్యమను ఖడ్గము ఏ రెండు విధాలుగా ఉపయోగించవచ్చో చర్చించు.
2. క్రైస్తవులను భయపెట్టేలా పెర్గములో ఉన్న పరిస్థితులేవి?
3. "రోమీయుల రాష్ట్ర ప్రభుత్వానికి పెర్గము కేంద్రమైయుండి, చక్రవర్తి ఆరాధనను అమలు చేయడానికి" పూటపడియున్నట్టు పాఠం పేర్కొంది. పెర్గములో నివసించే క్రైస్తవుల మీద అది ఎలాటి ఒత్తిడి పెట్టి యుండవచ్చు.
4. "సాతాను సింహాసనం" ఏదైయుండునని అనుకుంటున్నావు? "సాతాను సింహాసనమని" ఈ పాఠం ఏమి తెలుపుతుంది. తన ప్రభావాన్ని కనుపరచే కేంద్రాలు సాతానుకు నేడు కూడ ఉన్నాయా?
5. అంతిపయనే వ్యక్తి ఎవరు? అతని గూర్చి మనకేమి తెలుసు? ఏ వ్యక్తిని గూర్చి తెలిసికొనడానికైనా అది సరిపోతుందా?
6. బాలాకు బిలాముల కథ చెప్ప సిద్ధపడియుండు. ఇశ్రాయేలీయుల పతనాన్ని బిలాము ఎలా తెచ్చాడు?
7. నేడు లోకంతో రాజీ పడడానికి సాతాను సంఘాన్ని తేగలిగినట్టయితే, అది సంఘ పతనాన్ని తెస్తుందా? రాజీపడే పాపాన్ని చర్చించు.
8. నీకొలాయితులెవరు? (ఎఫెసు ఉత్తరం వారిని గూర్చి చెప్పిన సంగతి తప్పక రివ్యూ చేయి.)
9. క్రొత్త నిబంధన ప్రకారం, అబద్ధ బోధకులను ఎలా ట్రీట్ చేయాలి?
10. అబద్ధ బోధకులతో పెర్గములోని సంఘం డీల్ చేయకపోవడానికి వీలైన కారణాలేవి? నేటి సంఘాలు ఎందుకు సంఘ క్రమశిక్షణను జరిగించడం లేదు?
11. "క్రమ శిక్షణను నిరోధించడానికిని," "దిద్దే క్రమశిక్షణకును" మధ్యగల వ్యత్యాసమేమి?
12. యేసు వాగ్దానం చేసిన "దాచబడిన మన్నా," "తెల్ల రాయి," "క్రొత్త పేరు" అనేవి ఏమైయుంటాయి? యేసు మన కొరకు భద్రపరచిన అద్భుతమైన దీవెనలను ఎరగడానికి సరిగ్గా యివి ఏమైయున్నవో మనం గ్రహించవలెనా?